నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రసూల్‌పురా: సికింద్రాబాద్ డివిజనల్ పరిధిలోని శాస్త్రీనగర్, మారుతి నగర్, జూపీటర్ కాలనీ 11 కేవీ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ మురళీకృష్ణ తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు టీచర్స్ కాలనీ, గన్‌రాక్ విలేజ్, శాస్త్రీనగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5. 30 గంటల వరకు మారుతీనగర్, రోడ్ నంబర్ 1 నుంచి 6 వరకు, ఈఎంఈ సిగ్నల్, జూపీటర్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

సనత్‌నగర్: జనప్రియా సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 వరక మోతీనగర్ బీఎస్‌పురికాలనీ, సుల్తాన్‌నగర్, శంకర్‌లాల్‌నగర్, నటరాజ్ నగర్, నేతాజీనగర్, ఎర్రగడ్డ, ప్రేమ్‌కుమార్, ఛత్రపతి శివాజీనగర్, బ్రహ్మశంకర్‌లాల్‌నగర్, బి.శంకర్‌లాల్‌నగర్, ఎర్రగడ్డ మెయిన్‌రోడ్డు, వెంకటేశ్వరకాలనీ, సౌత్ శంకర్‌లాల్‌నగర్, నాబార్డ్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ పార్సిగుట్ట మధుర నగర్ కాలనీ లోని శ్రీబంగారు మైసమ్మ దేవాలయంలో శుక్రవారం శాకంబరి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆషాడ మాసంల బోనాల వేడుకలు పురస్కరించుకుని కూరగాయలతో ఆలయాన్ని అమ్మవారిని అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో వచ్చిన మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు. ఆలయ చైర్మన్ గుర్రం పవన్ కుమార్ గౌడ్, కమిటీ సభ్యులు ఢిల్లీ బాలిరెడ్డి, ధనశేఖర్, మహేష్ నాయుడు, శ్రీకాంత్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో బల్కంపేట ఎల్లమ్మ



అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడ మాసం సందర్భంగా దాతల సహకారంతో అమ్మవారిని ప్రతి రోజు ప్రత్యేక అలంకరణ చేస్తున్నట్లు దేవాదయ శాఖ అధికారులు తెలిపారు.శుక్రవారం గర్భగుడిలో అమ్మవారిని, మూల విరాట్‌ను ఎల్లమ్మ అమితంగా ఇష్టపడే పలు రకాల గాజులు, పూలతో అలంకరించి పూజలు నిర్వహించినట్లు ప్రధాన అర్చకులు అనిల్ పంతుల్ తెలిపారు.

'గాంధీ'లో ఘనంగా బోనాలు



గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ ప్రాంగణంలో శుక్రవారం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మేళ తాళాలు, డప్పుల దరువులతో బోనాలను ఊరేగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. గాంధీ వైస్ ప్రిన్సిపాల్ రవిశేఖరరావు, ప్రొఫెసర్లు కృపాల్‌సింగ్, రమాదేవి, పూర్ణయ్య, చంద్రశేఖర్‌లు ముఖ్యఅతిథులుగా హజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏడీ జగదీశ్వర్, ఏఓ సుబ్బారావు, ఆయా విభాగాల అధికారులు శివ, ప్రభుసింగ్, సురేష్, ఎంపీహెచ్ఓ వేణుగోపాల్‌గౌడ్, సారంగపాణి, లక్ష్మణరావు, రమేష్, ఫిజికల్ డైరక్టర్ వేణు, పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

బెట్టింగ్ భూతానికి యువకుడు బలి

అమీర్‌పేట: బెట్టింగ్‌కు ఓ యువకుడు బలయ్యాడు. ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన మేరకు.. కామారెడ్డి జిల్లాకు చెందిన సోమేష్ కుమార్ (25)అమీర్‌పేట లీలానగర్‌లో నివాసముంటున్నాడు. కార్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్న అతడు ఆన్‌లైన్ బెట్టింగ్‌లు ఆడి భారీగా నష్టపోయాడు. రూ.8 లక్షల వరకు అప్పులు చేసి బెట్టింగ్‌లో పోగొట్టుకున్నాడు. కస్టమర్లు ఇచ్చిన డబ్బు కోసం ఒత్తిడి చేస్తుండటంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకుసమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసి పోస్టు మార్టం నిమిత్తం మృతదేహన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

దంచికొట్టిన వర్షం





రెజిమెంటల్‌బజార్ మనోహర్ థియేటర్ వెనుక ప్రాంతంలో..



అమీర్‌పేట, పంజాగుట్ట ప్రాంతాల్లో ముంచెత్తిన వరద..



బేగంపేటలో పర్యటిస్తున్న సికింబ్రాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్..



- జలమయమైన రహదారులు, లోతట్టు ప్రాంతాలు
- ఇండ్లలోకి చేరిన వరద నీరు
- ఇబ్బంది పడ్డ ప్రజలు

సనత్‌నగర్: కుండపోత వర్షంతో జనజీవనం అతలాకులమైంది. రహదారులు గోదారులుగా మారాయి. లోతట్టు ప్రాంతాలు జలసంద్రమయ్యాయి. ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులు అని తేడా లేకుండా వరదనీరు పోటెత్తి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. నాలాలు ఉప్పొంగి వరద రహదారులు, బస్తీలను ముంచెత్తింది. ముఖ్యంగా బేగంపేట ప్రధాన రహదారిలోని ఎయిర్‌కార్గో, ప్రకాష్‌నగర్, మయూరిమార్గ్, అల్లంతోటబావి. వడ్డెరబస్తీ, బ్రాహ్మణవాడీ, రెజిమెంటల్ బజార్, సింధీకాలనీ, జనరల్‌బజార్, కళాసీగూడ, సికింద్రాబాద్ 31 బస్టాండ్, ఎంజీరోడ్డు, అమీర్‌పేట, ఎస్సార్‌నగర్, బల్కంపేట-బేగంపేట మార్గంలోని ఆర్‌యూబీ తదితర ప్రాంతాలు నీటమునగడంతో వాహనదారులు, పాదచారులు నానా అవస్థలు పడ్డారు. సరిగ్గా విద్యా సంస్థలు, కార్యాలయాల విధులు ముగిసే సమయానికి ఒక్కసారిగా కుండపోతగా కురిసిన వర్షంతో తీవ్ర ఇబ్బందులు కలిగాయి. కొన్నిచోట్ల చెట్లు నేలకొరిగాయి. రహదారులపై నీటిని మళ్లించేందుకు అటు జీహెచ్ఎంసీ, ఇటు హైడ్రా ఎమర్జెన్సీ టీమ్‌లు రంగంలోకి దిగి శ్రమించాల్సి వచ్చింది. ఏ రహదారిలోకి వెళ్లినా మోకాలు లోతు నీరు ఉండడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడ్డారు. బేగంపేటలోని వరద ప్రభావ ప్రాంతాలను జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. సాయంత్రం 5 గంటలకు బయలుదేరిన వ్యక్తులు రాత్రి 10 గంటలకు గానీ ఇంటికి చేరుకోని పరిస్థితులు రహదారులపై ఏర్పడ్డాయి. కొన్ని చోట్ల చెట్లు నేలకొరిగే సమయంలో కరెంటు సరఫరాలో కూడా అంతరాయం ఏర్పడింది.

లాలాపేట: తార్నాక, లాలాపేట ప్రాంతాల్లో శుక్రవారం వర్షం దంచికొట్టింది. భారీ వర్షానికి తార్నాక, లాలాపేట ప్రధాన రహదారులతో పాటు సత్యానగర్, వినోభానగర్, లక్ష్మీ నగర్ తదితర లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సత్యానగర్ రోడ్డును చెరువును తలపించింది. వినోభానగర్‌లోని కొన్ని ఇండ్లలోకి వరద నీరు చేరింది. ఇంట్లోని వస్తువులన్నీ తడిచిపోయాయి.

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్‌లోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఫ్రైడే మార్కెట్ ర్యాంపు వద్ద భారీగా వరదనీరు నిలిచిపోయింది. చిలకలగూడ, కిందిబస్తీ, అన్నానగర్, ఫ్రైడేమార్కెట్, శ్రీనివాసనగర్, షాబాద్‌గూడల్లో వరదనీరు పొంగి ప్రవహించింది.

రసూల్‌పురా: రసూల్‌పురా, ఇందిరమ్మనగర్, శ్రీలంకబస్తీ, సీబీఎస్ నగర్ బస్తీల్లో ఇళ్ళల్లోకి వర్షపునీరు చేరింది. వీధుల్లో మోకాలిలోతులో వర్షపునీరు నిలిచింది. ఇళ్ళల్లోకి వర్షపునీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

అడ్డగుట్ట: అడ్డగుట్ట చంద్రయ్య హోటల్ నుంచి తుకారాంగేట్ వరకు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. లోతట్టు ప్రాంతాల్లో మోకాలి లోతు వరకు వరద నీరు చేరడంతో పాదచారులు సైతం ఇళ్లలో నుంచి బయటకు రాలేని పరిస్థితి ఎదురైంది. ఆజాద్ చంద్ర శేఖర్ నగర్లోని ప్రభుత్వ పాఠశాలలో ప్రహారీ గోడ కూలింది. దీంతో స్కూలు ప్రాంగణంలోకి పూర్తిగా వరదనీరు చేరాయి. స్కూలు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



లాలాపేట సత్యానగర్ రోడ్డులో..



వినోభానగర్‌లో..



తార్నాకలో..



ఫ్రైడే మార్కెట్ ర్యాంపు వద్ద ..



ఇందిరమ్మనగర్, శ్రీలంకబస్తీల్లో ..



గాయత్రినగర్ కాలనీలో..



కార్ఖానలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్



స్కూలులో నుంచి ప్రవహిస్తున్న వరదనీరు



చంద్రశేఖర్ నగర్ ప్రభుత్వ స్కూలులో కూలిన ప్రహరీ



తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ రోడ్డులో..



అడ్డగుట్ట చౌరస్తాలో ట్రాఫిక్ జామ్



ఏసీఎస్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో..

బోనాల ఉత్సవాలకు రండి



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఆహ్వానపత్రం అందజేస్తూ..



ఎమ్మెల్యేకు పద్మారావు గౌడ్‌కు ఆహ్వానం అందజేస్తున్న ఈఓ

సనత్‌నగర్: సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం (సెవన్ టెంపుల్స్) ప్రాంగణంలోని గ్రామదేవత పోచమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలకు హాజరు కావాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు శుక్రవారం ఆహ్వానం పలికారు. దేవాలయం ఈఓ సత్యనారాయణనాయుడు, ఆలయ ప్రధాన అర్చకులు రవీంద్రాచార్యులు, అర్చకులు గోపాల్‌జోషి తదితరులు ఎమ్మెల్యేను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

సికింద్రాబాద్: చిలకలగూడలోని ప్రతిష్టాత్మక కట్టమైసమ్మ దేవాలయంలో నిర్వహించే బోనాల వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావును ఆలయ ఈఓ మహేందర్‌గౌడ్, ఫెస్టివల్ కమిటీ మెంబర్ గుంటి కృష్ణ కోరారు. శుక్రవారం ఎమ్మెల్యేను వ్యక్తిగతంగా కలిసిన వారు ఇరువురు ఆహ్వానపత్రికను అందించారు.

లాలాపేట: ఆదివారం తార్నాక మున్సిపల్ డివిజన్ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో జరిగే బోనాల పండుగ వేడుకలకు హాజరు కావాలనీ కోరుతూ నగర డిప్యూటీ మేయర్, మాజీ మేయర్‌కు ఆహ్వానం అందింది. శుక్రవారం సెవెన్ టెంపుల్స్ చైర్మెన్ గండికోట విజయ్‌కుమార్ నేతృత్వంలో వేడుకల నిర్వాహణ కమిటీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతోభన్‌రెడ్డిని, మాజీ మేయర్ బండ కార్తీకచంద్రారెడ్డిని, మాజీ కార్పొరేటర్ ఆలకుంట సరస్వతి హరిని తార్నాకలోని వారి నివాసాల్లో కలిసి మాణికేశ్వర్‌నగర్‌లోని ఏడు గుళ్ల వద్ద జరిగే బోనాల జాతర ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను అందజేశారు.



డిప్యూటీ మేయర్‌ను ఆహ్వానిస్తున్న మాణికేశ్వర్‌నగర్ నాయకులు

బోట్లలో తరలించిన అధికారులు



రసూల్‌పురా: సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని ప్యాట్నీనగర్ పూర్తిగా మునిగిపోయింది.హైడ్రా కమిషనర్ రంగనాథ్, నార్త్‌జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్, అధికారులు ప్యాట్నీనగర్‌కు చేరుకున్నారు. హుటాహుటిన నాలుగు బోట్లు తెప్పించి 80 మందిని బోట్ల ద్వారా వెలుపలికి బయటికి పంపించారు. ఫైరింజన్ ద్వారా వర్షపునీటిని తోడారు.

బార్‌లో గొడవ..కేసు నమోదు

అమీర్‌పేట: స్నేహితులతో కలిసి బార్‌కు వెళ్లిన ఓ కానిస్టేబుల్ అక్కడి సిబ్బందితో గొడవపడ్డారు. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఎస్ఆర్ నగర్ పోలీసులు తెలిపిన మేరకు.. అమీర్‌పేటలోని బార్ వన్ అండ్ రెస్టారెంట్‌కు గురువారం రాత్రి నార్త్ జోన్ అడిషనల్ డీసీపీ వద్ద డ్రైవర్‌గా పనిచేసే ఏ.ఆర్.కానిస్టేబుల్ కె.వెంకటేష్ తన స్నేహితులైన మధు, శివకృష్ణలతో కలిసి బార్‌కు వెళ్లారు. అతిగా తాగి మద్యం మత్తులో ఉన్న మీకు ఫుడ్ సర్వ్ చేయబోమని..వెళ్లిపోవాలని బార్ సప్లయర్ ఎం.లక్ష్మయ్య, మేనేజర్ హరీష్ చెప్పారు. దీంతో వారితో వాగ్వాదానికి దిగి ఒకరికొకరు దాడి చేసుకున్నారు. కస్టమర్ల దాడిలో బార్ సిబ్బంది గాయపడ్డారు.బార్ సిబ్బంది కూడా ప్రతిదాడి చేశారని ఒకరిపై ఒకరు ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

అడ్డగుట్టను అభివృద్ధి చేసిన ఘనత మాదే

ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

అడ్డగుట్ట: డివిజన్‌లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచి ప్రజలకు ఉపకరించే కార్యక్రమాలు తమ ప్రభుత్వ హయాంలోనే చేపట్టామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన అడ్డగుట్ట కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ అడ్డగుట్ట మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ ను నిర్మించేందుకు రూ. 2.25 కోట్ల నిధులను గతంలోనే మంజూరు చేశామని, అదనంగా రూ.1.45 కోట్ల నిధులు కేటాయించి, అన్ని సదుపాయాల ఫంక్షన్ హాల్ ను నిర్మించేందుకు ఏర్పాట్లు జరుపుతున్నామని తెలిపారు.అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మి శ్రీనివాస్ మాట్లాడుతూ అడ్డగుట్టను అన్ని విధాలుగా అభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. జీహెచ్ఎంసీ అధికారులు పద్మలత, ఆశిష్ తివారి, బీఆర్ఎస్ నేతలు నక్క మధు, శ్రీనివాస్‌గౌడ్, మనోహర్ పాల్గొన్నారు.



అడ్డగుట్ట మల్టీపర్పస్ హాలు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

చిలకలగూడ ఏసీపీ శశాంక్‌రెడ్డి



సికింద్రాబాద్: బోనాల ఉత్సవాలు, ఫలహారం బండ్ల ఊరేగింపులో నిబంధనలు అతిక్రమించేవారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని చిలకలగూడ ఏసీపీ కే.శశాంక్ రెడ్డి హెచ్చరించారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఘనంగా బోనాలు నిర్వహించే 55 దేవాలయాలను గుర్తించి వాటి వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసినట్టు ఆయన శుక్రవారం విలేకరులకు తెలిపారు. చిలకలగూడ డివిజన్ పరిధిలోని యాభైకి పైగా ఆలయాల్లో బోనాల పండుగ వేడుకలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అదనపు పోలీసు బలగాలను రప్పించామని చెప్పారు. చిలకలగూడ, వారాసిగూడ, లాలాగూడ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ నెల 19, 20, 21 తేదీల్లో బోనాల వేడుకలు జరుగున్నాయి. చిలకలగూడ, లాలాగూడ, వారాసీగూడ పరిధిలో జరిగే బోనాల బందోబస్తు కోసం అదనంగా ఇద్దరు ఏసీపీలు, ఆరుగురు ఇన్స్‌పెక్టర్లు, 20మంది ఎస్ఐలు, 250మంది సిబ్బందితో బందోబస్త్ ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.

ఆధ్యాత్మికతతో ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలి

బన్సీలాల్‌పేట్: ప్రజలు ఆధ్యాత్మికచింతన ద్వారా సుఖ సంతోషాలతో జీవించాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ హమాల్‌బస్తీలో తన సొంత నిధులతో నిర్మించిన శ్రీ నల్లపోచమ్మ, ఉప్పలమ్మ దేవాలయాల ముఖ ద్వారాన్ని శుక్రవారం స్థానిక కార్పొరేటర్ కె. హేమలత, ఇన్‌ఛార్జీ జి. పవన్‌కుమార్ గౌడ్‌లతో కలిసి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలను గొప్పగా నిర్వహించుకొని ఆనందోత్సాహాలతో జీవనం సాగించాలన్నారు. ఎంతో కాలం నుంచి హమాల్‌బస్తీ ప్రజలు ఎదురు చూస్తున్న అమ్మవారి దేవాలయం ముఖ ద్వారం నిర్మాణానికి నోచుకుందన్నారు.



అమ్మవారి ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

సైన్స్ మ్యూజియంను సందర్శించిన విద్యార్థులు

బన్సీలాల్‌పేట్: దేశవ్యాప్తంగా జరుగుతున్న థింకర్ కోడింగ్ ప్రాజెక్టులో భాగంగా ఎస్ఆర్ఎఫ్ ఫౌండేషన్, కేప్ జెమినిల సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని 10 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన పేద విద్యార్థులు, టీచర్లు శుక్రవారం బిర్లా సైన్స్ మ్యూజియాన్ని, నక్షత్రశాలను సందర్శించారు. బన్సీలాల్‌పేట్, హైదర్‌గూడ, యూసుఫ్‌గూడ, బండిమేట్, సెయింట్ పీటర్స్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పేద విద్యార్థుల్లో పరిశీలన, ఆసక్తి, సృజనాత్మకతను పెంపొందించడానికి ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఎస్ఆర్ఎఫ్ ఫౌండేషన్ ప్రాజెక్టు ఇంజినీర్ లాల్ శేఖర్, బన్సీలాల్‌పేట్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. స్వప్నమాల పాల్గొన్నారు.



రేపటి బోనాలకు ఏర్పాట్లు పూర్తి



బోనాల ఉత్సవాలకు ముస్తాబైన బేగంపేట్ ప్రకాష్‌నగర్ భూలక్ష్మీ అమ్మవారి ఆలయం



విద్యుద్దీపాల వెలుగులో సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం

సనత్‌నగర్: ఈ నెల 20న ఆషాఢమాసం నాలుగో ఆదివారం నిర్వహించే బోనాల జాతరకు అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా దేవాలయ కమిటీల ప్రతినిధులు, దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు భద్రతాపరంగా ఎలాంటి లోపాలు జరక్కుండా ఉండేలా ప్రధాన ఆలయాల్లో సీసీ కెమెరాల ద్వారా పోలీసులు నిఘా ఉంచనున్నారు. బోనాల మహోత్సవాల నేపథ్యంలో ఆలయాలు విద్యుద్దీపాలతో శోభయామానంగా వెలుగొందుతున్నాయి. నియోజకవర్గంలోని 268 ఆలయాల్లో బోనాల ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మరోవైపు ప్రభుత్వం తరుపున అమ్మవారి ఆలయాలను అందంగా అలంకరించే నేపథ్యంలో ఆయా ఆలయాలకు రూ.1.63 కోట్లు ప్రత్యేక నిధులు కూడా మంజూరు చేశారు. ఆయా నిధులతో ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

- సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలో గ్రామదేవత పోచమ్మ అమ్మవారికి బోనాల జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఈఓ సత్యనారాయణ నాయుడు తెలిపారు.
- బేగంపేట్ శ్రీకట్టమైసమ్మ మహాలక్ష్మి అమ్మవారి బోనాలకు పూర్తి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ చెక్కల సుభాష్ ముదిరాజ్ తెలిపారు.
- బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలోని భూలక్ష్మీ అమ్మవారి ఆలయానికి రంగులు వేసి విద్యుద్దీప కాంతులతో అలంకరించినట్లు ఆలయ ధర్మకర్త విశాల్ సూదం తెలిపారు.
- ఈఎస్ఐ ఆస్పత్రి ఆవరణలోని బంగారు మైసమ్మ ఆలయం బోనాల ఉత్సవాలకు ముస్తాబైంది. ఉత్సవాలకు ఈఎస్ఐ వైద్యాధికారులతో పాటు పలువురు రాజకీయ నేతలు హాజరుకానున్నట్లు ఆలయ చైర్మన్ మనోహర్ తెలిపారు.

అయోధ్య నగర్ బస్తీలో పర్యటించిన ఎమ్మెల్యే

బొల్లారం: సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలోని 8వ వార్డు పరిధిలో ఎమ్మెల్యే శ్రీ గణేష్ పర్యటించారు. అనేక ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలను బస్తీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్, అంతర్గత రహదారులు, విద్యుత్, డబల్ బెదురూమ్ తదితర సమస్యలను తీసుకువచ్చారు. కంటోన్మెంట్ మాజీ వైస్ ప్రెసిడెంట్ జయప్రకాష్, బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. స్థానిక సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

బీసీలకు రక్షణ చట్టం తీసుకురావాలి

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీల పై జరిగే దాడులను అరికట్టాలంటే రక్షణ చట్టం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఉస్మానియా యూనివర్సిటీలో మాట్లాడుతూ బీసీల ఎదుగుదల చూసి ఓర్వలేని కొందరు దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పై దాడి సంఘటన మరకముందే మాల్కాజిగిరి నియోజకవర్గంలో కార్పొరేటర్ భర్త రాముయాదవ్ పై కొందరు దుండగులు దాడి చేసి గాయపరిచారని జాజుల లింగంగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.